క్లుప్తంగా

నేడు పరబ్రహ్మ కాశీ విశ్వనాథస్వామి సత్సంగం

మాచర్ల: పట్టణంలోని పరబ్రహ్మ కాశీ విశ్వనాథస్వామి జన్మదినోత్సవం సందర్భంగా సత్సంగం సోమవారం రింగురోడ్డు ప్రాంతంలో హనుమాన్ చాలీసా పారాయణం ఉదయం 7.29 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించటం జరుగుతుందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. స్వామి వారి అనుగ్రహభాషణం, సత్సంగం జరుపుతున్నట్లు.. స్వామీజీలు, మాతాజీలు, పీఠాధిపతులు, అధికారులు, భక్తులు ప్రతి ఒక్కరు పాల్గొని స్వామి వారిని దర్శించుకోవాలని తెలిపారు. మానుకొండ కల్యాణ మండపంలో అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. రింగురోడ్డులోని పరబ్రహ్మ కాశీ విశ్వనాథస్వామి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వామి వారి సేవ వివరాలకు 8074817374ను సంప్రదించాలన్నారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోండి

దుర్గి: మండలంలోని ముటుకూరు శాఖ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్‌ను సోమవారం నూతనంగా ప్రారంభించనున్నట్లు బ్రాంచి మేనేజర్ జి.బాలకృష్ణ ఆదివారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్ చైర్మన్ కె.ప్రమోద్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ఈ బ్రాంచ్‌ను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. జనరల్ మేనేజర్ బీవీ రమణారావు, జనరల్ మేనేజర్–2 పి.మారుతిరామ్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పి.వీరారెడ్డిలు విచ్చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు పొందాలన్నారు. రైతులకు ప్రత్యేకంగా ప్రభుత్వం అందిస్తున్న పథకాలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ వర్ల శ్రీనివాసు తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



ముప్పాళ్ళ: ద్విచక్ర వాహనం ట్రాక్టర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఇరువురికి తీవ్రగాయాలైన ఘటన మండల కేంద్రమైన ముప్పాళ్ళలోని ఈద్గా వద్ద ఆదివారం జరిగింది. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గోళ్ళపాడుకు చెందిన గొట్టిపాటి మంగేశ్వరరావు, మాచవరం నరసింహారావులు ద్విచక్ర వాహనంపై ముప్పాళ్ళ వెళుతూ ముప్పాళ్ళ వద్ద ఈద్గా వైపు మలుపు తిరుగుతున్న ట్రాక్టర్‌ను వేగంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న మంగేశ్వరరావు తలకు గాయం కాగా వెనకాల కూర్చున్న నరసింహారావు కుడి మోకాలు పైభాగాన కాలు విరిగి ఎముక బయటకు వచ్చింది. గాయపడిన ఇద్దరినీ చికిత్స నిమిత్తం 108 వాహనంలో నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు.


సత్తెనపల్లి టూ గోవా

సత్తెనపల్లి: గోవా టూర్‌కు సత్తెనపల్లి ఆర్టీసీ డిపో నుంచి బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ ఆదివారం తెలిపారు. గోవా టూర్ వెళ్లేందుకు సత్తెనపల్లి ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 25న రాత్రి 8:00 గంటలకు సూపర్‌లగ్జరీ బస్సు బయలు దేరుతుందన్నారు. గోవా నుంచి తిరిగి ఈ నెల 29న సాయంత్రం బయలుదేరి జూలై 2న ఉదయం సత్తెనపల్లి వస్తుందన్నారు. టికెట్ ధర రాను, పోను ఒక్కొక్కరికి భోజనంతో కలిపి రూ.7,500గా నిర్ణయించామన్నారు. గోవా టూర్‌కు వెళ్లాలనుకునే యాత్రికులు ఈ అవకాశం సద్వినియోగపరచుకోవాలని ఆయన కోరారు.


అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

క్రోసూరు: వివాహితతో అసభ్యంగా ప్రవర్తించాడన్న ఫిర్యాదుతో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.షఫీ ఆదివారం తెలిపారు. మండలంలోని బయ్యవరం గ్రామానికి చెందిన వివాహిత తన ఇంటి ముందు కూరగాయలు అమ్ముకుంటూ జీవిస్తుంటుంది. ఈ క్రమంలో ఈ నెల 21వ తేదీన అక్కడే నివసిస్తున్న శిరసాని రమేష్‌బాబు వివాహితతో అసభ్యంగా ప్రవర్తించాడని, చంపుతానని బెదిరించాడని బాధితురాలు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పాత కక్షల నేపథ్యంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ



క్షతగాత్రుడు కాకాని సాగర్



క్షతగాత్రుడు నరేంద్ర

సత్తెనపల్లి: పాత కక్షల నేపథ్యంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిన ఘటన పట్టణంలోని 21వ వార్డులో ఆదివారం జరిగింది. ఈ ఘర్షణలో ఒక వర్గానికి చెందిన ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులైన పి.నరేంద్ర, కాకాని సాగర్, పి.పోలమ్మలను చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఖాళీ స్థలం.. వ్యర్థాలకు నిలయం



దాచేపల్లిలో జన నివాసాల మధ్య ఖాళీ స్థలంలో పడవేసిన చెత్తచెదారం



రోడ్డు పక్కనే పడవేసిన చెత్తచెదారంతో డంపింగ్ యార్డులా ఉన్న దృశ్యం

- వ్యర్థాలు తొలగించకపోతే అనర్థాలే అధికం
- ఖాళీ స్థలాల్లో ఇష్టానుసారం పడేస్తున్న చెత్తచెదారం, వ్యర్థాలు
- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజలు
- చెత్తచెదారంలో పందులు, కుక్కల స్వైరవిహారం

దాచేపల్లి : ఖాళీ స్థలాలు వ్యాధులకు కేంద్రంగా నిలుస్తున్నాయి. ఎక్కడ ఖాళీగా స్థలం కనిపిస్తే అక్కడ చెత్తచెదారం పడవేస్తున్నారు. వ్యర్థాలు, చెత్తచెదారం, ప్లాస్టిక్ ఖాళీ స్థలాల్లో పడవేయటం ద్వారా దోమల వ్యాప్తికి నిలయంగా మారుతున్నాయి. దీంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. బహిరంగ ఖాళీ ప్రదేశాల్లో చెత్తచెదారం పడవేయటం మంచి పద్ధతి కాదని తెలిసినా కొంతమంది ఇష్టానుసారంగా పడేస్తున్నారు. ఖాళీ స్థలాల్లో పడవేసేది చెత్తే కదా అని తేలిగ్గా తీసుకుంటే అదే మన ప్రాణాలకు ముప్పు తెచ్చిపెడుతుంది.

ఖాళీ స్థలాల్లో చెత్తచెదారం

నగర పంచాయతీతో పాటు గ్రామాల్లో ఖాళీ స్థలాలు చెత్తచెదారంకి నిలయంగా మారుతున్నాయి. ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ చెత్త గుట్టలు గుట్టలుగా పడవేస్తున్నారు. నగర పంచాయతీ పరిధిలో వడ్డెర కాలనీ వద్ద జన నివాసాలను ఆనుకుని ఖాళీ స్థలం ఉంది. ఈ స్థలంలో చుట్టుపక్కల నివాస గృహాల వారు చెత్తను తీసుకువచ్చి పడవేస్తున్నారు. ఈ స్థలంలో చెత్తచెదారం దిబ్బలు దిబ్బలుగా పేరుకుపోయింది. వ్యర్థాలు, కుళ్లిన ఆహార పదార్థాలు ఇక్కడ వేయటం వలన తీవ్రమైన దుర్వాసన వస్తుందని స్థానికులు చెబుతున్నారు. అదే విధంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో కూడా చెత్తను పడవేస్తున్నారు. నగర పంచాయతీ పరిధిలో మురుగు కాలువల్లో తీసిన పూడికను రోజుల తరబడి రోడ్లపై వదిలేస్తున్నారు. దీంతో కూడా దుర్వాసన వస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఖాళీ స్థలాల్లో చెత్తచెదారాన్ని ఇష్టం వచ్చినట్లుగా వేస్తున్నారు.

ఎక్కువైన పందులు, కుక్కల సంచారం

ఖాళీ స్థలాల్లో వేసిన వ్యర్థాలపై పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వ్యర్థాలలో లభించే వాటిని తినేందుకు పందులు, కుక్కలు వస్తున్నాయి. పందుల సంచారంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రోజుల తరబడి చెత్తచెదారం ఖాళీ స్థలాల్లో ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది.

వ్యాధులు ప్రబలే అవకాశం

ఖాళీ స్థలాల్లో పడవేసిన చెత్తచెదారంతో వ్యాధుల ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంది.

ఖాళీ స్థలంలో పడవేసిన వ్యర్థాలు, చెత్తచెదారం తొలగించకపోతే దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. అసలే వర్షాకాలం.. ఆపై చెత్తచెదారంలో దోమలు వ్యాప్తి చెందితే దోమ కాటు వలన డెంగీ, చికెన్‌గున్యా, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి ఖాళీ స్థలాల్లో ఉన్న చెత్తచెదారం తక్షణమే తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సమాజ సేవే వాసవీ క్లబ్ లక్ష్యం



మాచర్ల: వాసవీ క్లబ్ ఉదయాస్తమాన సేవలలో భాగంగా ఒక రోజు సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు పూర్తి సమాజ సేవలకు వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఆఫీసర్ వేమా దయాకర్ పిలుపునిచ్చారు. అందులో భాగంగా ఆదివారం వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ అధ్యక్షులు ఓరుగంటి చెన్నకేశవరావు ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య వృద్ధాశ్రమంలో డాన్ టూ డెస్క్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దయాకర్, ఇంటర్నేషనల్ కో ఆర్డినేటర్ ఎం.చిరంజీవి హాజరైనట్లు పేర్కొన్నారు. పలు సేవా కార్యక్రమాలలో పాల్గొని అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి సభ్యుడు సేవే పరమావధిగా పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. రీజియన్ చైర్మన్ మేడం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 2 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్, కంటి చూపు లేనివారికి చేతి కర్రలు, నిరుపేద విద్యార్థులకు పుస్తకాలు అందజేసినట్లు తెలిపారు. పోలీసులకు రేడియం జాకెట్లు, వీధి వ్యాపారులకు తోపుడుబండ్లు అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, కార్యదర్శి పందిరి నరసింహారావు, ఉప కార్యదర్శి బచ్చు రాజ్‌కుమార్, కోశాధికారి చుండూరు సత్యనారాయణ, వృద్ధాశ్రమ అధ్యక్షులు పోలిశెట్టి పిచ్చయ్య, మహిళా నేతలు పరిటాల ధనలక్ష్మి, మేడా వెంకటలక్ష్మి, రమాదేవి, నేరెళ్ళ నాగేశ్వరరావు తదితరులున్నారు.

ప్రభుత్వాసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉదయభాను, పక్కన వైద్యులు

మాచర్ల: రాష్ట్రంలో మాచర్ల కమ్యూనిటీ ఆసుపత్రి డెలివరీ, ఆరోగ్య సేవల్లో మొదటి స్థానంలో ఉందని, రాజీపడకుండా వైద్యులంతా ఉత్తమ వైద్యమందిస్తున్నారని ఈ అవకాశాన్ని పేదలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎ.ఉదయభాను అన్నారు. ఆదివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రి ద్వారా అందిస్తున్న ఉత్తమ వైద్య సేవలను వివరించారు. అందులో భాగంగా ఈ నెల 9వ తేది అర్ధరాత్రి 3 గంటల సమయంలో ఆర్ అండ్ బీ బంగ్లా వద్ద ఒక యాచకురాలైన మేకల శ్రీలక్ష్మి డెలివరీ అయి ఒక ఆడపిల్లకు జన్మనిచ్చినట్లు వైద్య సిబ్బంది తెలుసుకున్నారు. అప్పటికప్పుడు ఆ తల్లీ బిడ్డను ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయటం జరిగిందన్నారు. అందులో భాగంగా ఆ చిన్నారి కేజిన్నర బరువు ఉండటంతో ఆ పాపకు సంరక్షించటం జరిగిందన్నారు. ఇప్పటికే మేకల శ్రీలక్ష్మికి ఇద్దరు పిల్లలున్నారని, ఆమె యాచక వృత్తి కొనసాగిస్తుండటంతో ఈ చిన్నారి పరిస్థితి ఇలాగే ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైద్యశాల తరఫున ఆ చిన్నారి పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవటం జరిగిందన్నారు. తమ ఆసుపత్రిలో అవసరమైన పౌష్టికాహారం అందిస్తున్నామని, రాబోయే రోజుల్లోనూ ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. ఏ విధంగా కాపాడుకోవాలనే విషయంలో పలు జాగ్రత్తలు తీసుకునేందుకు ప్రత్యేకంగా ఆలోచన చేస్తున్నామన్నారు. ఇందుకు పోలీసు, రెవెన్యూ, శిశు సంక్షేమం, మీడియాకు తెలియపరచి అన్ని రకాలుగా చిన్నారిని రక్షించాలనే తపన ఉందన్నారు. ఎవరూ అనవసరంగా బయట ప్రాంతంలో డెలివరీ చేసుకోవద్దని, ప్రభుత్వాసుపత్రిలో డెలివరీ ఉచితంగా చేసుకోవాలన్నారు. ఉచితంగా అన్నీ రకాల సేవలందించే ప్రభుత్వ వైద్యశాలను సద్వినియోగం చేసుకునేందుకు పేదలంతా ముందుకు రావాలన్నారు. వైద్యులు సౌమ్య, మరియ సాగర్ రాణి, జయప్రకాష్, వివేక్, పలువురు ఉన్నారన్నారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్‌కు చికిత్స



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం



వైద్య పరీక్షల బస్సు వద్ద రోటరీ సభ్యులు

చిలకలూరిపేట: క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించడం ద్వారా సమర్థంగా చికిత్స అందించవచ్చని ప్రముఖ అంకాలజిస్టు డాక్టర్ ముఖేష్ తెలిపారు. వెంకటరాయ శ్రీధర్ ఫౌండేషన్, రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని రోటరీ కమ్యూనిటీ హాలు వద్ద ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష శిబిరం ఆదివారం నిర్వహించారు. శిబిరాన్ని ధనలక్ష్మి గ్రూపు ఆఫ్ కంపెనీస్ డైరెక్టర్ పేర్ని వీరనారాయణ, వెంకటరాయ శ్రీధర్ ఫౌండేషన్ చైర్మన్ తోటకూర సీతారావమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ముఖేష్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిని తొలి దశలో గుర్తించలేని పక్షంలో పరిస్థితి ప్రమాదకరంగా మారుతుందని హెచ్చరించారు. 40 సంవత్సరాలు దాటిన వారు తప్పనిసరిగా ప్రతి ఏడాది క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. రొమ్ము, గర్భాశయ, నోటి క్యాన్సర్ ఎక్కువగా సోకుతున్నట్లు వివరించారు.

రొమ్ములో గడ్డ, సొట్టలు, అణగారిన చర్మం, రొమ్ము నుంచి రక్తం కారడం, వాయడం వంటివి క్యాన్సర్ లక్షణాలని చెప్పారు. కాళ్ల నొప్పి, పొత్తి కడుపు నొప్పి తరుచుగా అలసట, నెలసరి తర్వాత రక్తస్రావం వంటివి గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ లక్షణాలని వివరించారు. నోటి లోపల, చిగుళ్ల లోపల గడ్డలు, వాపులు, పెదవులపై మచ్చలు, అకస్మాత్తుగా నోటి నుంచి రక్తస్రావం, తాగేటప్పుడు, మింగేటప్పుడు నొప్పి, అకస్మాత్తుగా దంతాలు వదులవ్వడం, బరువు తగ్గడం, నోటి లోపల పెరుగుతున్న గడ్డ వంటివి నోటి క్యాన్సర్ లక్షణాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సుమారు 100 మందికి క్యాన్సర్ నిర్ధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఐదుగురిని అనుమానితులుగా గుర్తించారు. వారి స్కానింగ్ రిపోర్టులు వచ్చాక.. రోటరీ ఫౌండేషన్ తరుపున ఉచితంగా వైద్యాన్ని అందిస్తామని క్లబ్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు కాపు వెంకటరావు, కార్యదర్శి ఆళ్ల వేమనరెడ్డి, సభ్యులు తోటకూర వెంకటనారాయణ, గళ్లా సాంబశివరావు, జూష్టి రంగారావు, మొహమ్మద్ యూసుఫ్ అలీ, ముక్తార్ అహమ్మద్, హైదరాబాద్ మల్లారెడ్డి ఆసుపత్రికి చెందిన వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ కవాతును జయప్రదం చేయండి



విజయపురిసౌత్: ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మహజన నేత మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు వరంగల్‌లో జూలై 7న జరిగే మాదిగల ఆత్మగౌరవ కవాతును జయప్రదం చేయాలని విజయపురిసౌత్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఎస్ మోహన్ మాదిగ కోరారు. ఆదివారం విజయపురిసౌత్‌లో నిర్వహించిన సమావేశంలో మోహన్ మాట్లాడుతూ మాదిగలు, ఉప కులాల ప్రజలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలంటే ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరిస్తేనే జరుగుతుందన్నారు. ప్రస్తుతం కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఎస్సీ వర్గీకరణకు అనుకూల ప్రభుత్వాలు ఉండటం హర్షించదగ్గ విషయమన్నారు. వరంగల్‌లో జరిగే మాదిగల ఆత్మగౌరవ కవాతును జయప్రదం చేసేందుకు నాగార్జునసాగర్ విజయపురిసౌత్ చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రతి మాదిగ విద్యార్థి, ఉద్యోగస్తులు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ అధ్యక్షుడు పి.జోసఫ్ మాదిగ, సీనియర్ నాయకులు బీర్నీడి కుమార్ మాదిగ, పి.సందీప్ మాదిగ, బీర్నీడి రమేష్ మాదిగ, ఎస్ అహరోను మాదిగ, ఎస్ బాబు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

సీసీఆర్సీ కార్డుతో కౌలు రైతులకు మేలు

రెంటచింతల: ప్రభుత్వం అందిస్తున్న రుణ అర్హత (సీసీఆర్సీ) కార్డును కౌలు రైతులు తీసుకోవడం వలన ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌలు రైతులు సీసీఆర్సీ కార్డులపై కచ్చితంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. రుణ అర్హత కార్డును కౌలు రైతులు తీసుకోవడం ద్వారా ఈ–పంట నమోదు చేసుకోవచ్చని, రైతులకు ఇన్సురెన్స్ ఉంటుందని, పంటను అమ్ముకొనుటకు, బ్యాంక్ రుణాలు తీసుకోవడానికి, వివిధ ప్రభుత్వ పథకాలు పొందుటకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతికూల వాతావరణం వలన పంటలు నష్టపోయిన సమయంలో కౌలు రైతులకు ఈ రుణ అర్హత కార్డుల వలన నష్టపరిహారం అందుతుందన్నారు. సీసీఆర్సీ కార్డులపై భూ యజమానులకు, కౌలు రైతులకు అవగాహన కల్పించి వెంటనే కార్డులను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి కౌలు రైతులు సీసీఆర్సీ కార్డు పొందవచ్చన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించొద్దు



గ్రామస్తులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్సై బలరామ్‌రెడ్డి

నాదెండ్ల: గ్రామాల్లో రాజకీయ కక్షలు, కార్పణ్యాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలని చిలకలూరిపేట రూరల్ సీఐ కె.శ్రీనివాసరెడ్డి కోరారు. మండల కేంద్రమైన నాదెండ్ల ఉరవకట్ట సెంటర్ గాంధీ విగ్రహం వద్ద ఆదివారం శాంతి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ముగిసినందున రాజకీయ చర్చలు, కార్యకలాపాలకు స్వస్తి పలకాలని కోరారు. నూతన ప్రభుత్వం ఏర్పడినందున ప్రతి ఒక్కరు తమ పనుల్లో నిమగ్నమై ప్రశాంతంగా ఉండాలన్నారు. అనవసర ఉద్రేకాలు, ఘర్షణలకు పాల్పడి కేసుల్లో ఇరుక్కోవద్దని, గొడవలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు ధ్వంసం చేసి జైళ్ల పాలు కావద్దని హెచ్చరించారు. ఎవరైనా ఉద్రేకాలకు, గొడవలకు పాల్పడితే సమాచారమివ్వాలని కోరారు. ఎస్సై జె.బలరామ్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

మనిషిని మనిషిలా గౌరవించటం మన సంప్రదాయం

ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల: మనిషిని మనిషిలా గౌరవించటం మన సంప్రదాయమని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ శివారులో పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ మూమెంట్ ఆధ్వర్యంలో సంగీత ధ్యాన జ్ఞాన మహోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే యరపతినేని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురజాల నియోకవర్గంలో 30 సంవత్సరాల నుంచి రాజకీయం చేస్తున్నానని, ఎవరికి ఎలాంటి హాని చేయలేదని తెలిపారు. కార్యకర్తలు కూడా ఎవరిపై గొడవలకు దిగకుండా క్రమ శిక్షణతో నడుచుకోవాలని ఆయన సూచించారు. అనంతరం ప్రసన్నాంజనేయస్వామి వారి దేవస్థానంలో పూజలు నిర్వహించారు. అదే విధంగా జానపాడు గ్రామంలో పెద్ద అమ్మవారి మొక్కుబడుల కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కేసానుపల్లిలో రెండు డయేరియా కేసులు నమోదు



ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితుడు రాజు



బాధితులకు మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది



శుభ్రం చేసిన తాగు నీటి ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో వెంకటరమణ

- బాధితులకు వైద్య సేవలు అందిస్తున్న ఆరోగ్య సిబ్బంది
- ట్యాంకర్ల ద్వారా తాగు నీటి సరఫరాకు ఏర్పాట్లు

దాచేపల్లి : మండలంలోని కేసానుపల్లి గ్రామంలో మరో రెండు డయేరియా కేసులు ఆదివారం నమోదయ్యాయి. ఎస్సీ కాలనీకి చెందిన వినుకొండ రాజు, వినుకొండ రిషి అతిసార బారిన పడ్డారు. ఒకరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతుండగా మరొకరు ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. రెండు, మూడు సార్లు వాంతులు, విరేచనాలు అయ్యే వారికి ఆరోగ్య సిబ్బంది స్థానికంగా వైద్య సేవలు అందిస్తున్నారు. ఎస్సీ కాలనీలోని చర్చిలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్లు ఇమ్మడిశెట్టి అమూల్య, మధు, ఆరోగ్య సిబ్బంది బాధితులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఎంపీడీవో వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి నాగెండ్ల రత్నం, నాయకులు నెల్లూరి రామకోటయ్య, సర్పంచ్ శ్రీపతి ప్రసాద్, ఎంపీటీసీ చెట్టిపోగు ఏసుదాసు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అంగడి సోమయ్య గ్రామంలో పర్యటించారు. తాగు నీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయించారు. ఎస్సీ కాలనీలో ఉన్న తాగు నీటి బోర్లను ఉపయోగించవద్దని ప్రజలకు సూచించారు. ట్యాంకర్ల ద్వారా తాగు నీరు సరఫరా అయ్యే ఏర్పాట్లు చేశామని చెప్పారు. మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని పారిశుధ్య కార్మికులు తొలగిస్తున్నారు. అతిసార కేసులు కొత్తగా నమోదు కాకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో వెంకటరమణ చెప్పారు.

డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ సేవలు ఎనలేనివి



డాక్టర్ శ్యామ్ ప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మాచర్ల: పట్టణంలో డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ బీజేపీ అధ్యక్షులు ఓర్సు క్రాంతికుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కూనిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డాక్టర్ శ్యామ్ ప్రసాద్ సేవలను కొనియాడారు. బీజేపీ కార్యాలయంలో డాక్టర్ శ్యామ్ ప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కో కన్వీనర్ పోకూరి కాశీపతి, రాష్ట్ర కమిటీ మాజీ మెంబర్ బొగ్గవరపు మస్తాన్‌రావు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ జక్కా సీతారామయ్య, దుర్గి మండల అధ్యక్షులు వెలిదండి శ్రీనివాసరావు, జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, పట్టణ సహాయ కార్యదర్శి లాగా పేరయ్య, పట్టణ యువజన మోర్చా అధ్యక్షుడు మారం వంశీ, బచ్చు రామారావు, యేచూరి సురేష్, గరిణే శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి

దుర్గి: భారతీయ జన సంఘ్ స్థాపకులు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని దుర్గిలో బీజేపీ మండల అధ్యక్షుడు వెలిదండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శ్రీకారం చుట్టారన్నారు. ఆయన పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా శ్యామ్ ప్రసాద్ వర్ధంతిని నిర్వహిస్తున్నామన్నారు. 1951 సం''రంలోనే భారతీయ జన సంఘ్ పార్టీ స్థాపించిన మహోన్నత వ్యక్తి వర్ధంతిని జరుపుకోవడం మన అదృష్టమన్నారు. అఖండ భారతదేశ స్ఫూర్తిని రగిలించిన జాతీయవాది, దేశ భక్తుడని అన్నారు. దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ మెంబర్ సీనియర్ నాయకులు జక్కా సీతారామయ్య, బీజేపీ నాయకులు తుపాకులు కోటేశ్వరరావు, ఎల్లబోయిన వెంకటేశ్వర్లు, బొల్లెద్దుల శాంతి ప్రసాద్, మల్లె వెంకట్రామయ్య, నాగెండ్ల మరియదాస్, అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుదర్శన హోమం



లక్ష్మీనరసింహస్వామి



హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు దంపతులు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని కొండమెట్ల వద్ద ఉన్న అతి పురాతనమైన శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో ఏరువాక పౌర్ణమి పురస్కరించుకొని ఆదివారం స్వామి వారికి పంచామృత అభిషేకం, సుదర్శన హోమం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, లీలావతి దంపతులు యజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నదానం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన నాయకుడు నాగశ్రీను రాయల్, బీజేపీ నాయకులు లెనిన్ కుమార్, పోట్లూరి సైదారావు, నలబోతుల రామకోటేశ్వరరావు, మోటమర్రి నరసింహారావు, పువ్వాడ కృష్ణ, సనిశెట్టి లక్ష్మీనారాయణ, కాళింగరాజు, శ్రీనివాసరావు, ఆలయ సేవకులు జాజుల మాల్యాద్రి పాల్గొన్నారు.